బాలమిత్ర, జి. రామలక్ష్మి - హైదరాబాదు

## సందేహం

ఒకసారి బాబా సన్నిధిలో చాలామంది భక్తులు కుప్పలు కుప్పలుగా ఉన్నారు. బాబా వారికి సూక్తులు బోధిస్తున్నారు.

అవి వింటున్న చాలామందికి "ఒకసారి ఒక దేవుడు ఒక చోటనే ఉండగలడు కానీ, రెండు మూడు చోట్ల ఒకేసారి ఎలా ఉండగలడు, అది సాధ్యమా, ఊరకే అంటున్నారా" అన్న సందేహం వచ్చి ఒకరినొకరు ప్రశ్నించుకోసాగారు. బాబా ఆగకుండా సూక్తులు అలా చెప్పుకుపోతూనే ఉన్నారు.

అంతలో ఒక గడుగ్గాయి దూరంగా ఉన్న ఒక పెద్ద చెట్టుపైకి ఎక్కేసి దిగలేక నానా అవస్థా పడుతూ చివరికి కాలుజారి, "బాబా రక్షించు" అని అరుస్తూ పడిపోయాడు.

బాబా వాడిని రెండు చేతులతో పట్టుకొని, "మరెందుకీ తుంటరి చేష్టలు? దిగగలవనే ఎక్కావా - అంత ఎత్తున్న చెట్టుపైకి? అంటూ క్రిందికి దింపి వెళ్ళమన్నారు.

ఆ చెట్టుకీ, బాబా సింహాసనానికీ గల దూరం వంద అడుగులపైనే వుంది. ఆ పిల్లాడు పరుగున వచ్చి అందరికన్నా ముందు వరసలో కూర్చున్న తల్లిదండ్రుల వద్దకుద వచ్చి కూర్చున్నాడు. అతని నుదుటిపైన రక్తం కారుతోంది. అది చూసి, అతని తల్లిదండ్రులు కంగారుపడి, "ఏమిటా రక్తం? ఏమయింది నాయనా!" అని అడిగారు.

"ఏమీ కాలేదు! యింకా నయం! బాబా నన్ను తన రెండు చేతులతో అందుకుని కాపాడారు. కాబట్టి బ్రతికిపోయాను" అంటూ బాబా కేసి తిరిగి, "అరె బాబా! మీరు అప్పుడే నాకన్నా ముందెలా వచ్చేసారు అక్కడ నుంచి యిక్కడికి!" అంటూ ఆశ్చర్యంగా అడిగాడు ఆ గడుగ్గాయి బాలుడు.

"అసలు బాబా యిక్కడి నుంచి కదలనే లేదు యిందాకటి నుంచి! మేమంతా ఆయన చెప్పే బోధనలను వింటూనే వున్నాం. మరి నిన్నెలా పట్టుకున్నారు?" అని అందరూ ఆశ్చర్యంగా అడిగారు.

బాబా చిన్నగా నవ్వుకున్నారు.

“అవును. అంతెత్తుమీంచి పడినా “బాబా రక్షించు” అన్న నా కేకకు వచ్చి పట్టుకుని ఆ చెట్టుక్రింద దించేసి, పొమ్మన్నారు మందలించి ఏం బాబా?” అనడిగాడు ఆ పసివాడు.

బాబా చిరునవ్వు నవ్వి, “ఇప్పటికయినా కోతిచేష్టలు మాని, బుద్ధిగా వుండుమరి, అలా బుద్ధిగా వున్నావంటే నీకు తాయిలం పెడతాను! అయినా ఇక్కడ కొందరికి ఒకేసారి ఒక దేవుడు రెండు మూడు చోట్ల ఉండగలడా అన్న సందేహం ప్రబలింది. మరి పసివాడివి నీవే చెప్పు వారికి సమాధానం!” అంటూ నవ్వారు.

అందరి సందేహం తీరి బాబాని క్షమాపణ కోరుకున్నారు తమ తప్పిదాన్ని క్షమించమని. అప్పుడు బాబా వారితో “భగవంతునికి అడుగడుగునా భక్తులు ఉంటారు. వారి వారి కోరికలను, ఆపదలను తీర్చడానికి, వారి రక్షణార్థమై భగవంతుడు ఒకే రూపంలో వేయిమందికి ఒకేసారి అగుపించగలడు. భగవంతుడు సర్వాంతర్యామి, నిశ్వార్థంగా, నిర్మలమైన మనస్సుతో ఎవరైతే భగవంతుని కొలుస్తారో - అలాంటివారు భగవంతునికి అత్యంత ప్రీతిపాత్రులు. ఈ సత్యాన్ని ఎప్పుడూ మర్చిపోవద్దు” అన్నారు.

‘ఇందుగలడందులేడని సందేహము వలదు చక్రి ఎందెందు వెదకిన అందందే కలడు’ అని ప్రహ్లాదుడు చెప్పిన పద్యం గుర్తువుంది కదా! హరిద్వేషి అయిన హిరణ్యకశిపుడు ఎగతాళి చేస్తూ, స్తంబంలో వున్నాడా అని అడిగితే ‘వున్నాడు’ అని నిశ్చయంగా చెప్పాడు ప్రహ్లాదుడు. దాంతో నిజాన్ని పరీక్షించి చూడాలని హిరణ్యకశిపుడు స్తంబాన్ని గదతో పగలగొట్టినప్పుడు శ్రీమహావిష్ణువు నరసింహావతారంలో బయటికి రాలేదూ! అలాగే సాయిబాబా కూడా ఆ భగవంతుని దివ్య అవతారమే!

అందుకే అంటారు. భక్తి ఒకరి సొత్తుకాదు, భగవంతుడు ఒకరి ఆస్తికాదని. భక్తి ఎక్కడ ఉంటుందో భగవంతుడు అక్కడే ఉంటాడు సదా కాపాడుతూ, రక్షిస్తూ. అందుకే భగవంతుడిపట్ల ఎన్నడూ సందేహాన్ని కలిగివుండకూడదు.